సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 7 । అక్టోబర్ । 2024



హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు
దసరా ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి మండలం కొట్లపల్లి సమీపంలో జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు ఆదివారం పోటాపోటీగా సాగాయి.

8లో



టమాట కిలో రూ.52
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.52 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి ధర రూ.40 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.9°/21.4°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమంలు ప్రజలు అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా అర్జీ అందజేయవచ్చని పేర్కొన్నారు.

టెండర్లు సజావుగా సాగాలి



టెండర్ దాఖలుపై సూచనలిస్తున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

హిందూపురం: మద్యం షాపులకు టెండర్ల దాఖలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, జిల్లా అధికారి గోవింద్‌నాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు సూచించారు. వీరు ఆదివారం హిందూపురం ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ హిందూపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 మద్యం దుకాణాలకు ఎవ్వరైనా, ఎక్కడి నుంచైనా ఆన్‌లైనా, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్క వ్యక్తి ఎన్ని దరఖాస్తులనైనా చేయవచ్చన్నారు. దరఖాస్తుదారు తన ప్రతినిధిగా మరొక వ్యక్తిని నియమించుకోవచ్చని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు, డిజిటల్ సహాయకులతో సమావేశం నిర్వహించి దరఖాస్తుదారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ హరికృష్ణ, ఎస్ఐలు పద్వీరాజ్, ఫరూక్, ఓం సింహా తదితరులు పాల్గొన్నారు.

పసికందును వదిలేసిన మహిళ
- సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు



పాపను ఐసీడీఎస్ వారికి అప్పగించిన దృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ ఐదు నెలల పసికందు(అమ్మాయి)తో వచ్చింది. పక్కనే ఉన్న ప్రయాణికురాలికి పసికందును ఇచ్చి.. తాను బాత్రూమ్‌కు వెళ్లి వస్తానని, కాసేపు చూడాలని కోరింది. అలా వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. దీంతో డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పసికందు తరఫు మహిళ కోసం గాలించారు. ఎక్కడా ఆచూకీ కనిపించలేదు. దీంతో పసిపాపను స్టేషన్‌కు తీసుకెళ్లి.. సదరు మహిళపై సుమోటో కింద కేసు నమోదు చేశారు. రాత్రికి ఐసీడీఎస్ వారిని పిలిపించి పాపను అప్పగించారు. సోమవారం సీడబ్ల్యూసీ వారి వద్ద పాపను హాజరుపరచి.. శిశు విహార్‌కు చేర్పనున్నట్లు తెలిపారు. పసికందు ఎవరో గుర్తించినా.. వదిలేసి వెళ్లిన మహిళ గురించి ఆచూకీ తెలిసినా 94407 96851 నంబర్‌లో సంప్రదించాలని సీఐ నారాయణరెడ్డి సూచించారు.

ఇస్తారా.. వదిలేస్తారా..?

కాసుల వర్షం కురిపించే మద్యం దుకాణాల టెండర్లు దక్కించుకునేందుకు కూటమి నేతల అనుచరులు పోటీపడుతున్నారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు చేస్తున్న వారి వివరాల గురించి నేతలు రాత్రిపూట ఎక్సైజ్ అధికారులతో టచ్‌లోకి వెళ్తున్నట్లు సమాచారం. ఔత్సాహికుల గురించి ముందస్తు సమాచారం తెలుసుకుని ఫోన్‌ద్వారా బెదిరింపులకు దిగుతున్నారు. టెండర్‌కు దూరంగా ఉంటే మంచిదని, లేకుంటే ఆర్థికంగా నష్టపోతారని వార్నింగ్ ఇస్తున్నారు.



- మద్యం దుకాణాలపై కూటమి నేతల పెత్తనం
- దరఖాస్తుదారుల సమాచారం తెలుసుకుని బెదిరింపులు
- ఆఫ్‌లైన్ వీడి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు పలువురు సిద్ధం
- లాటరీ వచ్చినా రూములు అద్దెకు దక్కనివ్వబోమని బెదిరింపులు
- జిల్లా వ్యాప్తంగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే అనుచరుల హల్‌చల్


87	జిల్లాలో మద్యం దుకాణాలు
8	జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్లు

సాక్షి, పుట్టపర్తి: టీడీపీ– బీజేపీ– జనసేన కూటమి నాయకులు సంపాదనే ధ్యేయంగా పావులు కదుపుతున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమకు అనుకూలంగా మలచుకోవాలని చూస్తున్నారు. తాజాగా మద్యం దుకాణాల టెండర్లపై అందరి దృష్టి పడింది. పుట్టపర్తిలో ఆన్‌లైన్ దరఖాస్తులు చేస్తున్న వారిపై కూటమి నేతలు ప్రత్యేక నిఘా ఉంచారు. బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేస్తూ.. మద్యం దుకాణ టెండర్లలో పలువురు పాల్గొంటారనే ప్రచారం ఊపందుకోవడంతో స్థానికంగా ఉన్న ఆశావహులు అప్రమత్తం అవుతున్నారు. అయినా దరఖాస్తులు మాత్రం మందకొడిగానే సాగుతున్నాయి. మద్యం దుకాణాల టెండర్ల విషయంలో ధర్మవరంలో టీడీపీ – బీజేపీ – జనసేన నేతల మధ్య పోటీ నెలకొంది. ఫలితంగా ప్రాంతాలుగా విభజించుకుని దందా చేసేందుకు ప్లాన్ చేసినట్లు సమాచారం. టెండర్లు తమకే వచ్చేలా.. ఎవరినీ దరఖాస్తు చేయనీయకుండా బెదిరిస్తున్నట్లు తెలిసింది. లాటరీలో మద్యం దుకాణం ఎవరికి దక్కినా రూములు అద్దెకు దొరక్కుండా ఇబ్బందులకు గురి చేస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అనుచరులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. దరఖాస్తు చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. ఎమ్మెల్యే అనుచరులు బెదిరిస్తుండటంతో చాలామంది నిరుత్సాహంలో ఉన్నారు.

కమీషన్ కోసం హుకుం

పెనుకొండలో మంత్రి సవిత అనుచరులు మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎవరు దక్కించుకున్నా ప్రతి నెలా 20 శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. లేనిపక్షంలో దరఖాస్తు చేయకుండా ఉండాలని సూచిస్తున్నారు. హిందూపురంలో బాలకృష్ణ పీఏల కనుసన్నల్లోనే మద్యం దుకాణాల టెండర్లు నడుస్తున్నట్లు సమాచారం. ప్రతి నెలా కమీషన్ ఇస్తే.. ఎలాంటి ఇబ్బందులూ ఉండవని చెబుతున్నారు. లేదంటే ముందుగానే తప్పుకోవాలని సూచించినట్లు తెలిసింది. మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అనుచరులు మద్యం దుకాణాల టెండర్లలో తలదూర్చినట్లు చెబుతున్నారు. కర్ణాటకకు సరిహద్దున ఉండటంతో దుకాణాలు దక్కించుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారు. ప్రతి షాపు నుంచి నెలవారీ మామూళ్లు ఇవ్వాల్సిందేనని ముందుగా హెచ్చరించినట్లు తెలిసింది.

దరఖాస్తు చేసుకోండి



మద్యం దుకాణాల టెండర్ల విషయంలో ఎవరూ ప్రలోభాలకు, బెదిరింపులకు గురి కావొద్దు. నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ముహూర్తాల కోసం చాలామంది వేచి ఉన్నారు. ఫలితంగా ప్రారంభంలో దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి. చివరి రెండు రోజుల కోసం ఎవరూ వేచి చూడవద్దు. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే ఇబ్బందులు పడతారు. ఒకట్రెండు రోజులు ముందుగానే దరఖాస్తు చేసుకోండి. ఎవరైనా బెదిరిస్తే మా దృష్టికి తీసుకురండి.

– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి

ఇద్దరు బ్రహ్మకుమారీలు దుర్మరణం
- అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొన్న కారు
- డ్రైవర్ సహా ఆరుగురికి తీవ్ర గాయాలు




మృతులు సరస్వతమ్మ, నారాయణమ్మ

లేపాక్షి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బ్రహ్మకుమారీలు దుర్మరణం చెందారు. ఇదే ప్రమాదంలో డ్రైవర్ సహా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. చోళసముద్రం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. లేపాక్షిలోని బ్రహ్మకుమారీ – ఓం శాంతి సభ్యులు ఏడుగురు ఓ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆదివారం మడకశిరకు కారులో బయలుదేరారు. కార్యక్రమం ముగించుకుని సాయంత్రం తిరుగు పయనమయ్యారు. చోళసముద్రం జాతీయ రహదారి సర్కిల్‌లో కుంగిన రోడ్డుపై వేగం అదుపుకాక కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బ్రహ్మకుమారీలు బిసలమానేపల్లికి చెందిన సరస్వతమ్మ (57), చిలమత్తూరు మండలం చినగానపల్లికి చెందిన నారాయణమ్మ (65) అక్కడికక్కడే మృతి చెందారు. లేపాక్షికి చెందిన అంజినప్ప, శశాంక్, ఇ.సరస్వతమ్మ, బిసలమానేపల్లికి చెందిన నారాయణమ్మ, లక్ష్మమ్మ, కర్ణాటకలోని నగరిగెరకు చెందిన రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైవే వాహనం ద్వారా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో నారాయణమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం బెంగళూరు ఆస్పత్రికి పంపినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి, ఎంపీ మధ్య భగ్గుమన్న విభేదాలు
- కల్యాణమండపం నిర్మాణ పనులకు బ్రేక్



శిలాఫలకం కోసం సిద్ధం చేసిన దృశ్యం

సాక్షి, టాస్క్ ఫోర్స్: అధికార తెలుగుదేశం పార్టీలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి సవిత మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. సోమందేపల్లిలో ఉప్పర కులస్తుల కల్యాణమండపం నిర్మాణం కోసం ఎంపీ రూ.కోటి నిధులు మంజూరు చేశారు. సోమవారం ఎంపీ చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం చేపట్టేందుకు ఆ సామాజికవర్గం నాయకులు శిలాఫలకం సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం సదరు స్థలం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా కొంతమంది టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. పక్కనే తమ స్థలం ఉన్నందున.. సర్వే చేసిన తర్వాతే కల్యాణమండప నిర్మాణానికి భూమి పూజ చేసుకోవాలని అభ్యంతరం తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితి చేయిదాటకుండా చూశారు. మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గంలో ఎంపీ పెత్తనం ఏమిటని పలువురు కార్యకర్తలు ఆగ్రహించినట్లు తెలిసింది. స్థల వావాదాన్ని మంత్రి వర్గీయులే తెరపైకి తెచ్చి ఆదివారం పోలీసులు, రెవెన్యూ అధికారులను ఉసిగొల్పి ఎలాంటి నిర్మాణాలూ చేపట్టవద్దని ఆదేశాలు ఇప్పించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల తర్వాత నుంచి బీకే వర్గీయుల పట్ల వివక్ష చూపుతున్నారని టీడీపీలో ఓ వర్గం ఆరోపిస్తోంది.

మహిళపై హోటల్ వర్కర్ అనుచిత ప్రవర్తన



అనంతపురం: నగరంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఉన్న ముత్యాలరెడ్డి హోటల్‌లో టిఫిన్ కోసం వెళ్లిన ఆర్మీ ఉద్యోగి భార్యపై అక్కడి సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు... నగరంలోని సెవెన్‌హిల్స్ కాలనీలో నివాసముంటున్న ఆర్మీ ఉద్యోగి భార్య తన ఇద్దరు పిల్లలతో కలసి ఆదివారం సాయంత్రం ముత్యాలరెడ్డి హోటల్‌కు వెళ్లి ఓ పూరి, దోశ ఆర్డర్ ఇచ్చింది. అదే సమయంలో అక్కడ పని చేస్తున్న వెంకటేష్ కల్పించుకుని ఓ పూరి సరిపోతుందా? రెండు తినండంటూ ప్లేట్‌లోకి వేశాడు. అయితే ఆర్డర్ ఇచ్చింది ఒక్కటేనంటూ ఆమె తిరస్కరించడంతో 'ఏం పర్వాలేదు. నీవు నా తాలూకా. బిల్లు కట్టాల్సిన పనిలేదు' అంటూ అందరూ చూస్తుండగా ఏకవచనంతో సంబోధించాడు. దీంతో బాధిత మహిళ 'మీ ఇంట్లో ఆడవారిని ఎవరైనా ఇలాగే మాట్లాడినా.. తప్పుగా వ్యవహరించినా సరిపోతుందా? ఇలా మాట్లాడడం సరికాదు' అని వారించింది. ఆ సమయంలో ఆ వ్యక్తి మరింత రెచ్చిపోయి ప్రవర్తించడంతో ఆమె బోరున విలపిస్తూ తన భర్త ఆర్మీలో పని చేస్తున్నారని, దేశం కోసం పనిచేసే వారి కుటుంబం పట్ల ఇలాగేనా ప్రవర్తించేదంటూ తిట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం బాధిత మహిళ కుటుంబసభ్యులు ముత్యాలరెడ్డి హోటల్ నిర్వాహకులను నిలదీస్తే.. అక్కడ పని చేస్తున్న సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించిన మాట వాస్తవమేనని, ఈ అంశంలో తామేమీ చేయలేమని అన్నారు. దీంతో బాధిత మహిళ న్యాయం కోరుతూ అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రామావతారంలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో సాగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని చౌడేశ్వరి ఆలయంలో అన్నపూర్ణదేవిగా, మరకత మహాలక్ష్మి ఆలయంలో వారాహిదేవిగా, కన్యకా పరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణదేవిగా, వేపమాను గంగమ్మ ఆలయంలో వైష్ణవీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

రామావతార అలంకారంలో ఖాద్రీశుడు



'జిల్లేడుబండ'పై నీలినీడలు
- నిలిచిపోయిన ప్రాజెక్టు పనులు
- నిధుల విడుదలపై సర్కారు అలసత్వం
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపు



నిధులివ్వకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్ట్ నిర్మాణ పనులు

ముదిగుబ్బ: కరువు ప్రభావిత ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో ముదిగుబ్బ మండలంలో చేపట్టిన జిల్లేడు బండ ప్రాజెక్ట్ నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రాజెక్ట్ నిర్మాణం చేపడితే రెండు నియోజకవర్గాల తాగునీటి సమస్య తీరడమే కాక నాలుగు మండలాలకు సాగునీరు అందుతుంది. జిల్లేడుబండ ప్రాజెక్టు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం (2004)లో రూ.7 కోట్ల అంచనాతో రూపుదిద్దుకుంది. తర్వాత మరో రూ.4 కోట్లు పెరిగింది. అంటే ప్రాజెక్టు వ్యయం మొత్తం రూ.11 కోట్లకు చేరింది. అప్పట్లో 0.27 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఈ అంచనాలు సిద్ధం చేసి ప్రాజెక్ట్ పనులు చేపట్టారు. 2020లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు అదనపు నిధులు మంజూరు చేయించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్ట్ సంస్థ పనులు ప్రారంభించింది. ధర్మవరం నియోజకవర్గంలో ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరం, తాడిమర్రి మండలాలు, పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం మండలంలో 23 వేల ఎకరాలకు సాగునీరందించేలా డిజైన్ చేశారు. హంద్రీ-నీవా మెయిన్ కాలువ సమీపంలో బుక్కపట్నం మండలం మారాల వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేసి జిల్లేడుబండ ప్రాజెక్ట్‌కు కృష్ణా జలాలను అందించాల్సి ఉంది. 2.41 టీఎంసీల సామర్థ్యం, 23వేల ఎకరాలకు సాగునీరందించేలా రూ.680 కోట్ల అంచనాతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. ఎన్నికల సమయం వరకు రూ.160 కోట్ల మేర పనులు జరిగాయి.

పరిహారం కోసం ఎదురుచూపు

జిల్లేడుబండ ప్రాజెక్టుకు 2,200 ఎకరాల భూమి అవసరం. భూములు కోల్పోయే రైతులు తమకు పరిహారం ఇచ్చాకే ప్రాజెక్టు పనులు కొనసాగించాలని ఎన్నికల సమయంలో కరాఖండిగా చెప్పారు. కూటమి సర్కారు కొలువుదీరాక పనులు ఎప్పుడు మొదలు పెడతారా.. ఎప్పుడు బడ్జెట్ మంజూరవుతుందా అని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం దీనిపై ఎటువంటి స్పష్టతా ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రాజెక్ట్ పూర్తయ్యేదెప్పుడో?



జిల్లేడు బండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే ఎంతో మంది రైతుల ఆశలు నెరవేరుతాయి. తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయి. ప్రాజెక్ట్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– మల్లికార్జున, రైతు, నల్లచెర్లోపల్లి

బడ్జెట్ రాగానే పనులు ప్రారంభిస్తాం

భూసేకరణ కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తే రైతులకు కొంత మొత్తాన్ని చెల్లించి పనులు ప్రారంభిస్తాం. మొదటి విడతగా రూ.93 కోట్లకు ప్రతిపాదనలు పంపాం. కేటాయింపులు కాగానే చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాల్‌రెడ్డి, డీఈ, జిల్లేడుబండ ప్రాజెక్ట్

వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ప్రారంభం



వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వేడుకలలో భాగంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం నిర్వహించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించిన పండితులు కలశాలలో వేదమంత్రోచ్చారణ నడుమ పూర్ణ చంద్ర ఆడిటోరియానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన యజ్ఞ వేదిక వద్ద క్రతువులు ప్రారంభించారు. రుద్ర హోమం చేపట్టి.. దేవీ, రామాయణ, భాగవత పారాయణాలు పఠించారు. కుంకుమార్చన, మహాలక్ష్మి పూజ, దేవీ మహత్యం, సూర్యనమస్కారం, సహస్రలింగపూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు యజ్ఞంలో పాల్గొని తరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు వేద పండితులకు వస్త్ర దానం చేశారు. సాయంత్రం ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల నందిగిరి క్యాంపస్‌కు చెందిన గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ వి.భాస్కరణ్ వేడుకలనుద్దేశించి ప్రసంగించారు. నందిగిరి క్యాంపస్ విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు.

హిందుత్వం పేరుతో జాతి విచ్ఛిన్నానికి కుట్ర
- డీసీఎం రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలి
- సనాతన ధర్మం పేరిట రాజకీయాలొద్దు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: హిందుత్వం పేరుతో జాతిని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ పురందేశ్వరి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. ఇందులో భాగంగానే భక్తులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ అర్థరహిత ఆరోపణలు చేశారన్నారు. ముఖ్యంగా డీసీఎం మరో అడుగు ముందుకేసి సనాతన ధర్మం పేరుతో హిందువులను రెచ్చగొట్టేలా ప్రవర్తించారని విమర్శించారు. తిరుమల లడ్డూపై రాజకీయం చేయడం తగదని, ఆయన రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. ఆదివారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అధికారం చేపట్టిన తర్వాత కూటమి పెద్దలు నెరవేర్చలేదన్నారు. కేంద్రంతో అంటగాగుతున్న టీడీపీ, జనసేన పార్టీ ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, పోలవరం, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పురోగతిని పూర్తిగా పక్కన పెట్టాయన్నారు. వారి పాలనా వైఫల్యాలపై ప్రజలు దృష్టి సారించకుండా ఉండేందుకు చివరకు దేవుడి ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమలకు వెళ్లాలంటే సనాతన ధర్మం అంగీకరించదనే ధోరణిలో మాట్లాడడం సరికాదన్నారు. మత ప్రసక్తి లేని లౌకిక తత్వానికి కట్టుబడి ఉండాలని ప్రబోధించే సనాతన ధర్మానికి తూట్లు పొడిచారని మండిపడ్డారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఎన్నో ధార్మిక పీఠాలున్నాయని, ప్రత్యేకంగా రాజకీయ నేతలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ అప్పట్లో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన డిప్యూటీ సీఎంగా ఉన్న ఈ రాష్ట్రంలోనే ఇప్పటికే అదృశ్యమైన మహిళల గురించి సమగ్ర విచారణకు ఎందుకు ఆదేశించలేదో చెప్పాలన్నారు. ఆయన వ్యాఖ్యల్లో నిజం లేదు కాబట్టే మౌనంగా ఉండిపోయారని పేర్కొన్నారు. ముచ్చుమర్రి, పుంగనూరులో జరిగిన హత్యాచారాలపై కూటమి సర్కార్ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో చెప్పాలన్నారు. అస్తమానం అబద్ధాలు ఆడే హోంమంత్రి కానీ, డీసీఎం పవన్‌కళ్యాణ్ కానీ బాధిత కుటుంబాలను పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో కూటమి పెద్దలకు తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నసనకోట ముత్యాలు, కుంటిమద్ది రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: మండలంలోని దేవరపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడు ఎవరు అనేది నిర్ధారణ కాలేదు. కాగా, విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం జిల్లాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీ - గుర్తు తెలియని వ్యక్తి మృతి



సోమందేపల్లి: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లిలోని నల్లగొండ్రాయన పల్లి క్రాస్ సమీపంలో ఆదివారం ఉదయం నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తి (45)ని ఓ వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లిపోయాడు. ఘటనలో గాయపడి రోడ్డు పక్కన కూర్చొన్న వ్యక్తిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స ప్రారంభించేలోపు ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆచూకీ తెలిసిన వారు సోమందేపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

వృద్ధుడి బలవన్మరణం

అమరాపురం: మండలంలోని హేమావతి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మల్లప్ప (61) ఆత్మహత్య చేసుకున్నాడు. గత నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆయనకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య హనుమక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన పోలీసులు



గుంతలను పూడ్పిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని గుర్తించిన పోలీసులు సామాజిక బాధ్యతలో భాగంగా ఆదివారం గుంతలను పూడ్పించారు. రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కాంట్రాక్టర్ల సహకారంతో పోలీసులు పట్టణంలోని ప్రధాన రోడ్లకు పడిన గుంతలను పూడ్పించారు. పోలీసుల సామాజిక సేవను పట్టణ ప్రజలు మెచ్చుకున్నారు.

కందిని కాపాడుకోండి...

- జిల్లా వ్యాప్తంగా 92 వేల ఎకరాల్లో సాగు
- మొగ్గదశలో పంటను కాపాడుకోవాలని శాస్త్రవేత్తల సూచన
- చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని పిలుపు



గోరంట్ల మండలం గంగంపల్లి వద్ద సాగు చేసిన కంది పంట

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన సమయంలో వర్షాలు లేక పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయినా...కంది మాత్రం కళకళలాడుతోంది. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో సాగు చేసిన కంది పంట ఏపుగా పెరిగి పచ్చదనం సంతరించుకుంది. ముఖ్యంగా హైబ్రిడ్ కంది రకం ఇప్పటికే 5, 6 అడుగులు పెరిగి రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. చాలా మంది రైతులు వేరుశనగలో అంతర పంటగానే కాక కేవలం కంది మాత్రం సాగు చేశారు. ప్రస్తుతం కంది మొగ్గ దశకు చేరుకుంది. దీంతో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సాళ్ల మధ్యలోని గడ్డిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.

92 వేల ఎకరాల్లో సాగు

వేరుశనగతో పోలిస్తే కందికి పెట్టుబడి ఖర్చు తక్కువ. ఎకరాకు కేవలం 4 కిలోల విత్తనాలు సరిపోతాయి. కిలో రూ.150 విత్తన కందులు దొరుకుతున్నాయి. ఎకరా విస్తీర్ణంలో కంది విత్తడానికి, గడ్డి తొలగించడానికి రూ.10 వేలు ఖర్చు వస్తుంది. దిగుబడి 4 నుంచి 5 క్వింటాళ్లు వస్తుంది. మార్కెట్‌లో ఎంత రేటున్నా కందితో లాభాలే ఉంటాయి. అందువల్లే ఈ సారి జిల్లా రైతులు ఎక్కువ మంది కందివైపు మొగ్గుచూపారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 92,750 ఎకరాల్లో కంది సాగులోకి వచ్చింది. కీలకమైన సమయంలో వరుణుడు కరుణించకపోవడంతో మిగతా పంటలతో పాటూ కంది కూడా వాడుముఖం పట్టింది. రైతులు కూడా కందిపై ఆశలు వదిలేసుకున్నారు. అయితే ఇటీవల జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలు కందికి ప్రాణం పోశాయి.

సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జిల్లాలోని రొద్దం, కనగానపల్లి, గోరంట్ల, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని రైతులు ఈసారి ఎక్కువగా కంది పంట వేశారు. ప్రస్తుతం పూత దశకు చేరుకుంటోంది. ఈ దశలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడి రావడానికి ఆస్కారం ఉంటుందని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య తెలిపారు. మొగ్గ దశలో వేప నూనె 5 ఎంఎల్, క్లోరోపైరిపాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే కాయ దశలో లీటరు నీటికి కునాల్ పాస్ 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలని, పూత, కాయ దశలో నీటి తడులు ఇచ్చినట్లు అయితే 50 శాతం దిగుబడి పెరుగుతుందని ఆయన వెల్లడించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనసాడ్ 0.3 ఎంఎల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

‘ఉపాధి’కి అనుసంధానం చేయాలి



కంది సాగు వల్ల దిగుబడితో పాటు జీవాలకు కంది పొట్టు లభిస్తుంది. మిగతా పంటలతో పోలిస్తే పెట్టుబడి కూడా తక్కువే. అందువల్ల నేను ఏటా కంది సాగు చేస్తా. ఈసారి వర్షాలపై ఆధారపడి 5 ఎకరాల్లో కంది సాగు చేశా. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా. కంది సాగుకు ‘ఉపాధి’ని అనుసంధానం చేస్తే కూలీలు తగ్గి రైతుకు మేలు జరుగుతుంది. – చంద్రాయుడు, రైతు, పెదపల్లి

సాగు విస్తీర్ణం పెరిగింది



ఈ ఖరీఫ్‌లో రైతులు వేరుశనగతో పాటు కందికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లా రైతులు ఈ సీజన్‌లో 4 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, కంది 92,750 ఎకరాల్లో సాగులోకి రావడం విశేషం. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కంది సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాలతో పాటు చీడపీడల నుంచి కందిని రక్షించుకోవాలి.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

పిడుగుపాటుకు యువకుడి మృతి



శంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి

శింగనమల: మండల కేంద్రం శింగనమలలో ఆదివారం ఓ యువకుడు పిడుగు పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. శింగనమలకు చెందిన బొజ్జప్ప కుమారుడు శంకర్ (24) గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం గ్రామ సమీపంలోని పెద్ద కుంట అటవీ ప్రాంతంలో గొర్రెలు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో శంకర్‌పై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శింగనమల పోలీసులు శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హోరాహోరీగా ఎడ్ల బండి పోటీలు



పోటాపోటీగా పరుగుదీస్తున్న ఎద్దులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కొట్లపల్లి సమీపంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలో జిల్లా స్థాయి ఎడ్ల బండి పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించారు. ఒక్కో రౌండులో రెండేసి ఎడ్ల బండ్లు పాల్గొనగా విజేత బండిని తక్కిన రౌండ్లకు ఎంపిక చేస్తూ వచ్చారు. ఆదివారం రాత్రికి మొత్తం 3 రౌండ్ల పోటీలు పూర్తయ్యాయి. జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక నుంచి కూడా పలువురు యువకులు ఎండ్ల బండిని ప్రత్యేక వాహనాల్లో తీసుకువచ్చి పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు, వీక్షించేందుకు వచ్చిన అందరికీ నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. మధ్యాహ్నం వర్షం రాకతో కొంత సేపు పోటీలు నిలిపివేశారు. అనంతరం రాత్రి పొద్దు పోయేవరకూ ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: క్రీడలతో మానసిక, శారీరక వికాసం పెంపొందుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జీవీ వెంకటస్వామి అన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని పీటీసీ మైదానంలో క్రికెట్ టోర్నీ జరిగింది. మొత్తం 8 జట్లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై కణేకల్లు జట్టు విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ఆ శాఖ జేడీ డాక్టర్ జీవీ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు మరిన్ని జరుపుకోవాలని, శాఖా పరంగా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏజీఎస్‌జీఓ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, ఏహెచ్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్యం

- ఉద్యాన అధికారి చంద్రశేఖర్ సూచన



అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో మామిడిలో మంచి దిగుబడుల కోసం మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలనియ రైతులకు ఉద్యానశాఖ శ్రీసత్యసాయి జిల్లా అధికారి జి.చంద్రశేఖర్ సూచించారు. భూసారం పెంచుకోవడంతో పాటు ఈ సమయంలో ఆశించే చీడపీడల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొత్త చిగురు తొడిగే దశలో ఉన్నందున వర్షాల కారణంగా మచ్చకొమ్మ తెగులు, మచ్చ బూడిద తెగులు సోకే అవకాశం ఉందన్నారు. అలాగే డిసెంబర్, జనవరిలో తేనే మంచు పురుగు ఆశించే పరిస్థితి ఉంటుందన్నారు. వీటన్నింటికీ చేపట్టాల్సిన ముందస్తు నివారణ చర్యలను ఆయన వివరించారు.

- భూమిలో ఆర్గానిక్ కర్బన్ శాతం చాలా తక్కువగా ఉన్నందున రసాయన ఎరువుల వాడకం అధికంగా ఉంది. రసాయన ఎరువులను తగ్గించి వాటి స్థానంలో పశువుల ఎరువు, వర్మీకంపోస్టు లాంటివి వాడాలి. వర్షాలు కురుస్తున్నందున ఉలవ, పిల్లిపెసర, జనుము, జీలుగ లాంటి పచ్చిరొట్ట ఎరువుల (గ్రీన్ మెన్యూర్స్) కోసం తోటలో చెట్ల మధ్య చల్లుకుని పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నితే భూమి సారవంతమవుతుంది. దీని వల్ల మామిడిలో నాణ్యమైన దిగుబడులు వస్తాయి. ఎకరాకు 10 నుంచి 15 కిలోల చొప్పున పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు చల్లుకోవాలి.
- తోటలకు ఆశించే చీడపీడల నివారణకు లీటర్ నీటికి 7 గ్రాముల 13-0-45 + 2.5 మి.లీ క్లోరోపైరిఫాస్ + 2 మి.లీ హెక్సాకొనజోల్ కలిపి పిచికారీ చేయాలి. మళ్లీ 10 రోజుల తర్వాత లీటర్ నీటికి 0.5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 గ్రాములు ఆగ్రోమిన్ మ్యాక్స్ + 3 గ్రాములు సాఫ్ కలిపి పిచికారీ చేయాలి. తర్వాత 10 రోజులకు లీటర్ నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ + 2 గ్రాములు సల్ఫర్ కలిపి పిచికారీ చేసుకుంటే మామిడిలో మంచి దిగుబడులు వస్తాయి.

ఆర్టీసీ డ్రైవర్ బలవన్మరణం



రహంతుల్లా (ఫైల్)

గుంతకల్లు రూరల్: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి పెంచుకున్న ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆయన మృతిపై అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. వివరాలు.. గుంతకల్లులోని 6-అడుగుల రోడ్డు బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న రహంతుల్లా (55)కు భార్య పవిధ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రహంతుల్లాకు ఏడాది క్రితం పక్షవాతం సోకి కుడి కాలు, కుడి చెయ్యి పనిచేయకుండా పోయాయి. అప్పటి నుంచి ఆయన సిక్ లీవ్‌లోనే ఉన్నారు. చికిత్స కోసం పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగిన నయం కాలేదు. ఊత కర్రలేనిదే అడుగు కూడా వేయలేని రహంతుల్లా... తాను ఉద్యోగం చేయకపోతే కుటుంబ పరిస్థితి ఏమిటనే ఆలోచనల్లో పడి మానసికంగా కుదేలయ్యారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వాకింగ్ వెళ్లిచస్తానంటూ ఇంట్లో చెప్పి ఊత కర్ర సాయంతో బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. పాతకొత్తచెరువు గ్రామ చెరువు పక్కన గది వద్ద నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం ఉదయం స్థానికులు గురించి సమాచారం ఇవ్వడంతో గుంతకల్లు రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని రహంతుల్లాగా కుటుంబసభ్యులు సైతం నిర్ధారిస్తూ బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సరిగా నడవడం కూడా చేతకాని రహంతుల్లా పాతకొత్తచెరువు గ్రామం వరకూ ఎలా వెళ్లాడు. రోడ్డుకు కిలోమీటర్‌కు పైగా దూరంగా ఉన్న చెరువు వద్దకు ఎలా చేరుకున్నాడనేది యక్ష ప్రశ్నగానే మిగిలింది. కాలు, చెయ్యి సరిగా పనిచేయని వ్యక్తి అంతదూరం వెళ్లి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలూ వినవస్తున్నాయి.



జ్యోతులను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి సమీపంలోని వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం గ్రామస్తులు జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం సిద్ధేశ్వరునికి విశేష పూజలు చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఓడీచెరువు: మండలంలోని తంగేడుకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి పూర్తి చేసిన వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. నాటి చిలిపి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ జయచంద్రారెడ్డి, చెన్నారెడ్డి, రాధమ్మ, కృష్ణమూర్తి, మధు, కరుణాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు

బొమ్మల కొలువు.. భలే !



కొలువు దీరిన బొమ్మలు

సోమందేపల్లి: దసరా నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రమైన సోమందేపల్లిలోని హరినాథ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన బొమ్మలను తన ఇంటిలో ప్రదర్శించారు. వాటిని చూసేందుకు గ్రామస్తులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ప్రాచీన కళలకు అద్దం పట్టేలా బొమ్మలు ఉన్నాయి. ప్రతి ఏడాది దసరా ఉత్సవాల సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నట్లు హరినాథ్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

రాప్తాడు: మండలంలోని పాలచెర్ల గ్రామం వద్ద రైతుల పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి వైర్, ఆయిల్ చోరీ చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలచెర్ల గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, మల్లేష్, రాజు అనే రైతులు ముగ్గురు కలిసి తమ పొలాల సమీపంలో 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఎర్రిస్వామి 5 ఎకరాల్లో వేరుశనగ, మల్లేష్ 5 ఎకరాల్లో వేరుశనగ, రాజు 3 ఎకరాల్లో టమాట పంటను సాగు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలాల దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి వైర్ ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మత్స్య సంపద వృద్ధి



చెరువుల్లో వదలడానికి సిద్ధమైన చేప పిల్లలు



బీటీపీ మత్స్యక్షేత్రం

- 2.50 కోట్ల చేప పిల్లలను పెంచుతున్న అధికారులు
- నవంబర్ 28లోపు రిజర్వాయర్లు, చెరువుల్లో విడుదల

రాయదుర్గం: జిల్లాలో క్రమంగా మత్స్య సంపద పెరుగుతోంది. 2024-25వ ఆర్థిక సంవత్సరానికి గాను బీటీపీ, అనంతపురం, పీఏబీఆర్, పెనకచెర్ల వద్ద ఉన్న మత్స్యక్షేత్రాల్లో 2.50 కోట్ల చేప పిల్లలను అధికారులు పెంచుతున్నారు. 35 రోజుల క్రితం ఆయా క్షేత్రాల్లో వదిలిన మూడు రోజుల వయసున్న చేప పిల్లలు.. ప్రస్తుతం ఒకటిన్నర ఇంచు వరకూ ఎదిగాయి. ఇవి కాస్త మూడు ఇంచులకు ఎదిగి ఆరోగ్యంగా ఉంటే ఉమ్మడి జిల్లాల్లోని పలు రిజర్వాయర్లు, చెరువుల్లో వదిలేలా అధికారులు కార్యాచరణను సిద్ధం చేశారు.

లైసెన్స్ రిజర్వాయర్లలో ఉచితంగా...

జిల్లాలోని బీటీపీలో 35 లక్షలు, అనంతపురంలో 55 లక్షలు, పెనకచెర్లలో 80 లక్షలు, పీఏబీఆర్ వద్ద 80 లక్షలు చొప్పున కట్ల, రోహు, మృగ్యాల జాతులకు చెందిన చేపల సీడ్ (స్పాన్) ఉత్పత్తి జరుగుతోంది. అనంతరం వీటిని ఉమ్మడి జిల్లాలో లైసెన్స్ పొందిన బీటీపీ, పీఏబీఆర్, పేరూరు (అప్పర్ పెన్నార్ రిజర్వాయర్)లో వంద శాతం రాయితీలో విడుదల చేస్తారు. మిగిలిన వాటిని మత్స్య సహకార సంఘాలకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు విక్రయిస్తారు. అప్పటికీ మిగిలితే అన్నమయ్య జిల్లాలోని లైసెన్స్ రిజర్వాయర్లు, శ్రీశైలం బ్యాక్ వాటర్, వెలుగొండ ప్రాజెక్ట్‌లో వదిలేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఆగస్టులోనే అనువైన కాలం

చేప పిల్లలు పెంచి ఉత్పత్తి చేసేందుకు జూన్ నుంచి ఆగస్టు 15 వరకు అనువైన కాలం. రిజర్వాయర్లు, చెరువుల్లోకి అప్పుడప్పుడే కొత్త నీరు వచ్చి చేరుతూ ఉంటుంది. దీంతో చేప పొదుగు (హేచింగ్), చిప్పర పిల్లలను (రేరింగ్) సాకడానికి నర్సరీలను సిద్ధం చేస్తుంటారు. అయితే వర్షాభావ పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న జిల్లాలో ఇప్పటి వరకూ కేవలం హెచ్చెల్సీ నీటిపై ఆధార పడి చేపపిల్లల ఉత్పత్తిని చేపడుతున్నారు. హెచ్చెల్సీకి నీటి విడుదల ఆలస్యమైతే చేప పిల్లల పెంపకంలోనూ జాప్యం చోటు చేసుకుంటోంది.

ఈ ఆలస్యాన్ని భరించలేక మత్స్య సంఘాలు ఇతర ప్రాంతాల్లో అధిక ధరకు చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకోవాల్సి వస్తోంది. మత్స్యక్షేత్రాల వద్ద తగిన నీటి వసతి ఏర్పాటు చేసుకుని ముందే ఉత్పత్తి లక్ష్యం ప్రారంభిస్తే మత్స్యకారులకు మేలు చేకూరుతుందని మత్స్యకార సంఘాల నాయకులు అంటున్నారు.

వచ్చే నెల ఆఖర్లో రిజర్వాయర్లకు



జిల్లాలోని పలు మత్స్యక్షేత్రాల్లో సుమారు 2.50 కోట్ల చేప పిల్లలు పెంచుతున్నాం. ఇందులో 30 లక్షలకు తగ్గకుండా నాణ్యమైన దిగుబడి సాధిస్తాం. లైసెన్స్ రిజర్వాయర్లలో వంద శాతం రాయితీతో విడుదల చేస్తాం. ఆ తర్వాత మత్స్యకార సంఘాల అవసరాల మేరకు సరఫరా చేస్తాం. మిగిలిన వాటిని అన్నమయ్య జిల్లాకు ఇక్కడి నుంచే అందిస్తాం. నవంబర్‌లోనే చేప పిల్లలు విడుదల ప్రక్రియ కొనసాగుతుంది. కట్ల, రోహు, మృగ్యాల జాతులు ఎక్కువగా పెంచాం.

– లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీఓ, బీటీపీ